క్లుప్తంగా

24న పైడిమారమ్మ వనంగుడి ప్రతిష్ట



పైడిమారమ్మతల్లి వనం గుడి

కురుపాం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఈ నెల 23, 24వ తేదీల్లో శ్రీపైడి మారమ్మ అమ్మవారి వనం గుడి ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గుడి నిర్మాణకర్తలు దాత కొత్తకోట వెంకటసురేష్‌కుమార్ దంపతుల చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 23న ఉదయం 8గంటల నుంచి హోమం, 24న ప్రతిష్ఠా కార్యక్రమం, 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కురుపాంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉత్సవంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

26న ప్రజ్ఞా వికాస పరీక్ష

కురుపాం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 26న మండల కేంద్రం కురుపాంలో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.25 చెల్లించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. 26వ తేదీ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7671994813, 9441969693 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సరిహద్దు మాతకు ప్రత్యేక పూజలు



నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మాతగా భక్తులతో పూజలందుకుంటున్న బత్తిలి సంతోషిమాత ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ముందుగా మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామదేవతల సన్నిధికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ నెల 28 నుంచి జరగనున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ అధ్యాపకుడు మృతి

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న వారాడ ఈశ్వరరావు(49) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వీరఘట్టం మండలం రేగులపాడుకు చెందిన ఈయన గత 20 ఏళ్లుగా ఒకేషనల్ విభాగంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. నిన్నటి వరకు తమతో ఎంతో సరదా ఉండే మాస్టారు తెల్లవారేసరికి లేరనే వార్త తెలియడంతో కళాశాలలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రిన్సిపాల్ పైల శంకరరావు, అధ్యాపక సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మాస్టారుకు కన్నీటి వీడ్కోలు పలికారు.

అనారోగ్యంతో గురుకులం ఉద్యోగి మృతి

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో కిచెన్ హెల్పర్‌గా పనిచేస్తున్న కొండగొర్రె కాంతమ్మ(55) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఆమె మృతి పట్ల సహచర ఉద్యోగులతో పాటు, పాఠశాల, కళాశాల సిబ్బంది సంతాపం తెలియజేశారు. దహన సంస్కార ఖర్చుల కింద రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేసినట్లు గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని పెంకుటిళ్లు, గడ్డి కాలనీల్లో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా కాలనీలతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ వీధుల్లో వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్త లైట్లను అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.గౌరీశంకరరావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ నిధులతో వీధిలైట్లను అమర్చుతున్నట్లు తెలిపారు.

పదికి ప్రత్యేక ప్రణాళిక



గుమ్మలక్ష్మీపురం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న హెచ్ఎం

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలు

గుమ్మలక్ష్మీపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూలు విడుదల అయింది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు ప్రతిరోజూ అన్ని సబ్జెక్టుల్లోని పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేయించడం, వారి సందేహాలను నివృత్తి చేయడం వంటివి చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సమ్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులను ఏ–గ్రేడ్‌లోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో మొత్తం 740 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రత్యేక తరగతులతో ఎంతో మేలు

ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ప్రస్తుతం పునశ్చరణ తరగతులు జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అవి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు మాకు ఎంతో ఉపయోగపడతాయి.

– దందుపాటి భవ్యశ్రీ, పదో తరగతి విద్యార్థిని, గుమ్మలక్ష్మీపురం జెడ్పీహెచ్ఎస్

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి ఎంతో కీలకం. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. అందుకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

– బిడ్డిక భీముడు, హెచ్ఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుమ్మలక్ష్మీపురం

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ



లిల్లీపుష్పనాథంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: పాలకొండ డివిజన్ ఎన్జీఓ సంఘం గౌరవ అధ్యక్షుడు, నగరపంచాయతీ పూర్వపు కమిషనర్ వై.లిల్లీపుష్పనాథంను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం పరామర్శించారు. లిల్లీపుష్పనాథం అనారోగ్యం కారణంగా విశాఖలో చికిత్స తీసుకుని పట్టణంలోని తన స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని అందరికీ అందుబాటులోనికి రావాలని ఆకాంక్షించారు. వారితో పాటు కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కడగల రమణ, కిల్లారి మోహన్, నీలాపు శ్రీనివాసరావు, పల్లా భాను, కోడెం బాబి, కంచ్రోతు లక్ష్మీ, పాలవలస దుర్గేశ్వరరావు, టీకె రామకృష్ణ, ఎచ్చర్ల జయరాం ఉన్నారు.

శ్రీశ్రీ రచనలతో సమాజంలో చైతన్యం



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి రమణారావు

పాలకొండ రూరల్: తమ రచనలతో శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ), ఇతర మహాకవులు సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని సీపీఎం పాలకొండ మండల కన్వీనర్ దావాల రమణారావు అన్నారు. మంగళవారం రెడ్‌బుక్ డే సందర్భంగా స్థానికంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారీ విధానం వలన ఉపాధి రహిత అభివృద్ధి జరుగుతోందన్నారు. నిరుద్యోగం పెరిగి, ఉన్న ఉద్యోగాలకు భద్రత కొరవడుతోందన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానంలో సమాజాన్ని చైతన్యం చేసే ఎన్నో అంశాలు ఉన్నాయన్నారు. ఇటువంటి రచనలు చదటవం ద్వారా సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయవచ్చాన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆర్థముడి లక్ష్మణరావు, కె.రాము తదితరులున్నారు.

ఘనంగా గావు సంబరం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న యాదవులు

పాలకొండ రూరల్: పట్టణంలోని కొత్తవీధిలో నివాసముంటున్న యాదవులు మంగళవారం గావు పండగను ఘనంగా జరుపుకున్నారు. ఇలవేల్పుకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం సామూహిక అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. కుటుంబ సభ్యులంతా పెద్ద ఎత్తున్న ఒక చోటకు చేరుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల నుంచి శాఖా గ్రంథాలయాలకు రావాల్సిన గ్రంథాలయ సెస్సు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని పెదగుడబ గ్రామసచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పన్ను వసూలు లక్ష్యాలపై ఆరా తీశారు. మండలంలోని పలు పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు 2017 నుంచి పన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ఆర్.గోవిందనాయుడు, శాఖాగ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

భామిని: వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ జీవీ కృష్ణారావు మంగళవారం బత్తిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు, విచారణ పురోగతిని ఎస్సై వై.అమ్మన్‌రావును అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు పూర్తయిన కేసుల చార్జ్‌షీట్‌లు పెట్టాలని ఆదేశించారు. మండలంలోని మహిళా పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. దిశ యాప్‌పై, యాప్ వినియోగంపై మహిళలు, విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్సై అమ్మన్‌రావుతో కలిసి బత్తిలి ఏబీరోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

వీరఘట్టం: మండల కేంద్రంలోని రెల్లివీధికి చెందిన గొర్లె కృష్ణ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలు చెక్కును పంచాయతీ కార్యదర్శి వి.రామచంద్రరావు, సచివాలయం–4 కన్వీనర్ బొమ్మాళి హేమలత మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



ర్యాలీ చేస్తున్న రైతులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతులకు, పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి ధర్మారావు అన్నారు. మండలంలోని కుశిమి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రైతు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. ఈ విధానంలో 365 రోజులు నేలను కప్పి ఉంచాలన్నారు. తొలకరి వర్షాలకు ముందే పొడి దుక్కిలో వివిధ రకాల విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సోనియా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు తరలిరండి

పాలకొండ: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న నర్తు రామారావు బుధవారం శ్రీకాకుళంలో నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం విశాఖపట్నంలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఎస్.రమేష్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. రాజకీయ నాయకుల ఫొటోలు, పోస్టర్లు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

వీరఘట్టం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని తహసీల్దార్ ఎం.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలను పోలింగ్ బూత్‌లు, సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు.

సంపూర్ణ పోషణ అమలుపై సమీక్ష



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇస్తున్న సీడీపీఓ సుశీలాదేవి

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని పగడ్బందీగా అమలు చేయాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలాదేవి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల వారీగా ప్రీ స్కూల్ నిర్వహణ, సంపూర్ణ పోషణ పథకం అమలు తీరు, చిన్నారుల ఆరోగ్య వివరాల నమోదుపై సమీక్షించారు. కేంద్రాల్లో నమోదైన వారందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని సూచించారు.

రైతులు ఆందోళన చెందొద్దు



ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఏనుగులు ధ్వంసం చేసిన పంటలకు పరిహారం అందజేస్తాం
- ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండల పరిధిలోని కిమ్మి–నడుకూరు ప్రాంతంలో గజరాజులు సంచరిస్తుండడంతో ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం సందర్శించారు. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఆందోళన చెందొద్దని సూచించారు. ఏనుగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, వాటిని ఇక్కడ నుంచి తరలించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు కనిపిస్తే ఎలాంటి కవ్వింపు చర్యలకు పోవద్దని, రైతులు రాత్రివేళ పొలాల వైపు వెళ్లొద్దని కోరారు. ఫారెస్ట్ అధికారులు, పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించి పంటనష్టం నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. వారితోపాటు వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వీరఘట్టం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస ధనేశ్వరరావు, భోగి మణి, కిమ్మి సర్పంచ్ గురాన రామ్మోహనరావు తదితరులు ఉన్నారు.

చెరుకు తోటలో తిష్ట వేసిన ఏనుగులు

గత ఐదు రోజులుగా కిమ్మి–నడుకూరు ప్రాంతంలో చిట్టపులివలస సమీపంలోని చెరుకు తోటలో ఏనుగులు తిష్ట వేశాయి. చుట్టూ మొక్కజొన్న, చెరుకు, అరటి పంటలు ఉండడంతో ఏనుగులకు ఈ ప్రాంతం అనువుగా మారింది. ఆయా పంటలను తింటూ అక్కడే తిష్ట వేశాయి. ఇదిలా ఉండగా సమీపంలో ఉన్న చెరుకు రైతులు తమ పంటను ఏనుగులు ధ్వంసం చేయకుండా ముందుగానే కోతలు చేపడుతున్నారు.

సందడిగా ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న బాలికలు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీలో ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఇతర తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఓ సీహెచ్ రోహిణి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతే పునాది అని, కాబట్టి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

పాలవలసను కలిసిన నర్తు



పాలవలస రాజశేఖరంతో మాట్లాడుతున్న నర్తు రామారావు

పాలకొండ:

స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన నర్తు రామారావు మంగళవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరంను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ వేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు. రాజశేఖరంతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు నర్తు రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ భాష అమృతం



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు



తెలుగు అక్షరాకృతిలో విద్యార్థుల ప్రదర్శన

పాలకొండ రూరల్: అమ్మ భాష అమృతం వంటిదని అంపిలి పాఠశాల హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో తరగతులకు హాజరయ్యారు. సాంస్కృతిక, జానపద కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, జి.లక్ష్మన్నమ్మ, టి.అనిల్‌కుమార్, ప్రసాద్, పి.కాంతారావు, ఏ.ప్రభాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

- సీతంపేట: పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అ, తెలుగు అక్షరాకృతిలో ఏర్పడి అబ్బురపరిచారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



డీఈసీ మాత్రల పంపిణీపై ఆరా తీస్తున్న అధికారులు

గరుగుబిల్లి: విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లిభద్ర ఉన్నత పాఠశాలను కేంద్ర బృందం సందర్శించింది. విద్యార్థుల ఆరోగ్యం, డీఈసీ మాత్రల పంపిణీపై కేంద్ర బృందం సభ్యులు ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే చదువులపై శ్రద్ధ పెట్టగలరన్నారు. పాఠశాల, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

విష జ్వరాలపై ఆరా..



డెంగీ బాధితులతో మాట్లాడుతున్న ఏఎంఓ శ్రీనివాసరావు

భామిని: శ్రీకాకుళం జిల్లా సహాయ మలేరియా అధికారి బి.శ్రీనివాసరావు మంగళవారం భామిని మండలంలో పర్యటించారు. దోమల నివారణ, డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. మండలంలోని సొలికిరి, బాలేరు గ్రామాల పరిధిలో డెంగీ, మలేరియా జ్వరాలతో బాధపడుతున్న వారిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. దోమతెరలను ఉపయోగించాలని సూచించారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, ఎంపీహెచ్‌పీ పద్మరాజు, హెచ్‌పీ జె.లక్ష్మాయి, ఏఎన్ఎంలు మణికుమారి, సత్యవతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. గంగారేగువలస గ్రామ సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వినతులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ–సర్వీసులు పెంచాలని, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు.